www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన చిన్నకోడూరు తహసిల్దార్



3

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 137 | బుధవారం | 02 - 04 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజిలు : 8 | వెల : 4


### గాంధీ మునిమనవడి పిటిషన్‌ను

## కొట్టివేసిన సుప్రీం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని రూ.1,200 కోట్లతో ఆధునీకరించాలని గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవా రంనాడు కొట్టి వేసింది. రెండున్నరేళ్ల తర్వాత పిటిషన్ వేయడాన్ని జస్టిస్ ఎంఎం

2



# ఆ భూములు సర్కారువే

- వాటిపై పూర్తి చట్టబద్ధమైన హక్కులు మాకే
- అక్కడ అభివృద్ధితో పెద్దఎత్తున ఉద్యోగ కల్పన
- 400 ఎకరాలపై సుదీర్ఘ చర్చలో ప్రభుత్వం స్పష్టీకరణ
- మంత్రులు, పర్యావరణవేత్తలతో ముఖ్యమంత్రి సమీక్ష
- ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రులు



తొలిఅడుగు, హైదరాబాద్ : కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై ప్రతిపక్షాలు, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, పర్యావరణవేత్త నర్సింహారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాదానికి కారణమైన భూమిపై కూలంకషంగా చర్చ జరిగింది. అటు ప్రభుత్వం, ఇటు హెచ్‌సీయూ అధికారులు భూమికి సంబంధించి తమ వద్ద ఉన్న రికార్డులు, పత్రాల ఆధారంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆ భూమిపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని ప్రభుత్వం వాదనలు వినిపించింది. అక్కడ అభివృద్ధి పనులు చేపడితే ఉద్యోగ కల్పనకు పెద్దఎత్తున అవకాశాలు ఉంటాయని స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అడవి అనగల అన్ని అర్హతలు ఆ ప్రాంతానికి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్నట్లుగానే ఆ స్థలాన్ని

2



### మయాన్మార్‌కు

## ఆపన్న హస్తం

తొలిఅడుగు, న్యూఢిల్లీ : భూకంపంతో అతలా కుతలమైన మయాన్మార్‌ను ఆదుకునేందుకు ఆపరేషన్ బ్రహ్మను ప్రారంభించిన భారత ప్రభుత్వం తాజా మరో 50 టన్నుల సహాయక సామగ్రిని అందించింది. వివిధ రకాల సహాయక సామగ్రితో భారత నావికాదళానికి చెందిన సత్‌పుర, సావిత్రి నౌకలు యాంగూన్‌కు

2

### వల్లభనేని వంశీకి

## మరోసారి షాక్



తొలిఅడుగు, విజయవాడ: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరోసారి షాక్ తగిలింది. వల్లభనేని వంశీకి విజయవాడ కోర్టు ఇవాళ(మంగళవారం) రిమాండ్ పొడిగించింది. తమ భూమిని బెదిరించి లాక్కున్నారనే ఆరోపణలపై అత్కూరు పోలీసు

2

### గుజరాత్‌లో మంటల్లో కాలి

## 12 మంది మృతి




తొలిఅడుగు, డెస్క్ : గుజరాత్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బనస్కాంత జిల్లాలోని దీశ పట్టణంలో ఉన్న ఓ ఫైర్ క్రాకర్స్ తయారీ ఫ్యాక్టరీలో వరుస పేలుళ్లు సంభవించాయి. దీంతో మంటలు చెలరేగాయి. మంగళవారం చోటుచేసుకున్న ఈ సంఘటనలో మొత్తం 12 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుళ్ల ధాటికి

2

## జర్మనీ యువతిపై అత్యాచారం



తొలిఅడుగు, హైదరాబాద్ : హైదరాబాద్‌లో జర్మనీ యువతిపై అత్యాచార ఘటనలో దర్యాప్తు జరుగుతోంది. ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న యువతికి లిఫ్ట్ ఇస్తానని చెప్పి కార్‌లో ఎక్కించుకున్నారు ముగ్గురు యువకులు. మీర్‌పేట్ దగ్గరలోని మందమల్లమ్మ దగ్గర.. సదరు యువతిని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. పహాడీ షరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది ఆ జర్మనీ యువతి. ముగ్గురు యువకులు తనపై లైంగిక దాడి చేశారని ఫిర్యాదు చేసింది. మీర్‌పేట్ దగ్గర లిఫ్ట్ ఇస్తామని చెప్పి వాళ్లు కార్ ఎక్కించుకున్నట్టు ఆమె కంప్లైంట్లో వివరించింది. తర్వాత పహాడీ షరీఫ్ ప్రాంతంలోని

2

### వాటిని కొనేందుకు

## ప్రభుత్వం సిద్ధం



తొలిఅడుగు, హైదరాబాద్ : జిల్లాలోని హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సేర్ఫ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు (మంగళవారం) ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట

2

### ఆ భూములను

## వేలం వేయడం కుదరదు



2

తొలిఅడుగు, హైదరాబాద్ : కంచె గచ్చిబౌలి భూముల పై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని ఆయన అన్నారు. కంచె

## ఏపీ, తెలంగాణకు వచ్చే 3 రోజులు వానలే వానలు



తొలిఅడుగు, హైదరాబాద్ : మరత్వాడ దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం ఏర్పడింది. దక్షిణ ఛత్తీస్గఢ్ నుండి విదర్భ, మరత్వాడ సమీప ప్రాంతంలోని ఆవర్తనం మీదుగా మధ్య మహారాష్ట్ర వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఇవాళ(మంగళవారం) తెలంగాణలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుండి వచ్చే నాలుగు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుండి నాలుగు

2

## సన్న బియ్యం పంపిణీపై సీఎస్ సమీక్ష





తొలిఅడుగు, హైదరాబాద్ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈరోజు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉగాది రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో

2

## గాంధీ మునిమనవడి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిపాదిత ఆధునికీకరణ వల్ల శతాబ్దాల చరిత్ర ఉన్న పాత ఆశ్రమం టోపోగ్రఫీ దెబ్బతింటుందని, ఇందువల్ల పలు భవనాలను ధ్వంసం చేయడం లేదా పునర్నిర్మాణం చేసే అవకాశాలున్నాయని పిటిషనర్ వాదించారు. అయితే, ప్రస్తుతం ఉన్న ఆశ్రమాన్ని చెక్కుచెదరనీయమని, ఎలాంటి మార్పులు చేయమని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రతిపాదిత ప్రాజెక్టు వల్ల మహాత్మాగాంధీ సిద్ధాంతాలు, ఆదర్శాలను భావితరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని ధర్మానం అభిప్రాయపడింది. తాము అన్ని అంశాలను పరిశీలించామని, అభ్యంతరం పెట్టడానికి ఏమీ లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తుషార్ గాంధీ పిటిషన్‌ను కొట్టివేసింది. అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని రూ.1,200 కోట్లతో ఆధునీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని గుజరాత్ హైకోర్టు 2022లో సమర్థించింది. ఆ నిర్ణయాన్ని తుషార్ గాంధీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

## గుజరాత్‌లో మంటల్లో కాలి 12 మంది మృతి

మొదటిపేజీ తరువాయి

ఫ్యాక్టరీ పైకప్పు కుప్పకూలింది. శిథిలాల కింద మరికొంత మంది కూలీలు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీస్తున్నారు. ఈ సంఘటనపై దీశ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ చౌదరి మాట్లాడుతూ.‘ దీశ ఇండస్ట్రియల్ ఏరియాలో భారీ పేలుడు సంభవించినట్లు ఈ ఉదయం మాకు సమాచారం అందింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడ్డ నలుగురు కూలీలను ఆస్పత్రికి తీసుకెళ్లాము. పేలుడు చాలా భారీ స్థాయిలో జరిగింది. దీంతో ఫ్యాక్టరీ స్లాబ్ మొత్తం కూలిపోయింది. స్లాబ్ కింద ఇరుక్కుపోయిన వారిని బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్నాము’ అని తెలిపారు.

## వల్లభనేని వంశీకి మరోసారి షాక్

స్టేషన్‌లో వల్లభనేని వంశీపై కేసు నమోదైంది. ఈ కేసులో న్యాయస్థానం రిమాండ్ పొడిగించింది. ఇదే కేసులో వంశీని ఒకరోజు పాటు న్యాయస్థానం ఇటీవల కస్టడీకి ఇచ్చింది. 15-04- 2025 వరకు వంశీకి రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ ప్రధాన అనుచరుడు మోహన్ రంగాను సీఐడీ కస్టడీలోకి తీసుకుంది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మూడు రోజుల పాటు సీఐడీ అధికారులు విచారించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అజ్ఞాతంలోకి మోహన్ రంగా వెళ్లారు. ఇటీవల రంగాను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. సీఐడీ కస్టడీకి అనుమతి ఇస్తూ విజయవాడ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## సన్న బియ్యం పంపిణీపై సీఎస్ సమీక్ష



మొదటిపేజీ తరువాయి

నిర్వహించేందుకు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయని, మిగిలిన స్టాక్‌ను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. బియ్యం నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

# మయాన్మార్‌కు ఆపన్న హస్తం

మొదటిపేజీ తరువాయి

చేరుకున్నాయి. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఎమ్‌సీసీ విమానాలతో పాటు నేవీకి చెందిన ఐదు నౌకల ద్వారా భారత్ ఆపరేషన్ బ్రహ్మ చేపడుతున్నట్టు యాంగూన్‌లోని భారత ఎంబసీ కూడా పేర్కొంది. భూకంపంతో ప్రభావితమైన యాంగూన్‌తో పాటు నేపీదా, మాండలేకు ఈ సామగ్రిని చేరుస్తున్నట్టు పేర్కొంది. రెక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత కలిగిన భూకంపంతో మయాన్మార్‌తో పాటు పొరుగున ఉన్న దేశాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. మయాన్మార్‌లో ఈ ప్రకృతి విపత్తు బారిన పడి మరణించిన వారి సంఖ్య 2 వేలు దాటింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. భూకంపం గురించి తెలియగానే మొట్టమొదటగా స్పందించిన భారత్..సహాయకసామగ్రి తోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా పంపించింది. ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా ఇప్పటివరకూ భారత్ రెస్క్యూ బృందాలు, వైద్య బృందాలు, తాగు నీరు, టెంట్లు, ఔషధాలు, ఇతర అత్యవసర వస్తువులను పలు విడతల్లో ఎయిర్‌ఫోర్స్, నేవి ద్వారా పంపించింది. మార్చి 29న ఎయిర్‌ఫోర్సుకు చెందిన విమానం 15 టన్నుల సహాయక సామగ్రిని యాంగూన్‌కు చేర్చింది. కోవిడ్ సంక్షోభ సమయంలో కూడా భారత్ పలు దేశాల ఔషధ అసరాలు తీర్చేందుకు ముందుకొచ్చింది. వ్యాక్సీన్ మైత్రి పేరిట సుమారు 90 దేశాలు ఔషధాలు సరఫరా చేసింది. ఆపరేషన్



సంజీవని పేరిట మాల్దీవులకు అత్యవసర ఔషధాలను అందజేసింది. రెండేళ్ల క్రితం టర్కీ, సిరియాలను భూకంపం కుదిపేసినప్పుడు భారత్ ఆపరేషణ్ దోస్తు పేరిట ఆపన్న హస్తం అందించి తన మానవతాదృక్పథాన్ని చాటుకుంది.

## ఆ భూములు సర్కారువే

ఉండనివ్వాలని హెచ్‌సీయూ అధికారులు, పర్యావరణవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. అయితే, భూమిపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేసిన ప్రభుత్వం.. తమ అభీష్టం మేరకే ముందుకు వెళతామన్న విషయమై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం వెలువర్చలేదు. అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకుని తదుపరి అడుగు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఈ భూమికి సంబంధించి ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా, ప్రభుత్వం న్యాయపరంగా కొట్లాడి సాధించుకున్నదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ, ప్రజా విజయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ఆ భూమిని పూర్తిగా గాలికొదిలేసిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో సమీక్ష తర్వాత మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహి ంచి, భూమికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. “హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యా లయానికి సంబంధించి ఇంచు భూమిని కూడా మా ప్రభుత్వం గుంజుకోలేదు. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న 400 ఎకరాలు యూనివర్సిటీకి సంబంధించినది కాదు. ఈ భూమిని ప్రభుత్వం లాక్కుని ప్లాట్లు చేసి, విక్రయించుకుంటోందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ భూమి మాదేనని హెచ్‌సీయూ భావిస్తోంది. కానీ, 2004 జనవరి 31న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ భూమిని బిల్లీరావు ప్రాతినిధ్యం వహించిన ఐఎంజీ ఫ్లోరిడాకు చెందిన ఐఎంజీ భారత్ అనే క్రీడా నిర్వహణ సంస్థకు కేటాయించింది. దానికి బదులుగా గోపనపల్లిలోని సర్వే నంబర్లు 36, 37ల్లోని 397 ఎకరాలను యూనివర్సిటీకి బదలాయించింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్, శేరిలింగంపల్లి ఎమ్మార్వో సంతకాలు చేశారు. అయితే, ఐఎంజీ భారత్ అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలను ప్రారంభించకపోవడంతో 2006 నవంబరు 21న అప్పటి వైఎసఆర్ ప్రభుత్వం ఆ కేటాయింపును రద్దు చేసింది.

## ఏపీ, తెలంగాణకు వచ్చే 3 రోజులు వానలే వానలు

మొదటిపేజీ తరువాయి

డిగ్రీలు తగ్గే అవకాశం ఉంది. మంగళవారం తెలంగాణలోని నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అలాగే ఇవాళ(ఏప్రిల్ 1) గరిష్టంగా నిజామాబాద్ లో 41.2 కనిష్టంగా హనుమకొండ లో 35.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. నిన్న(సోమవారం) తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, మహబూబ్ నగర్, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ లలో అత్యధిక



ఉష్ణోగ్రత నమోదు అయ్యాయి.

## జర్మనీ యువతిపై అత్యాచారం

ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డారు యువకులు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు పోలీసులు. ఇప్పటికే ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బాధితురాలు విదేశీ యువతి కావడంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం హాస్పటల్‌కు తరలించారు పోలీసులు.

## వాటిని కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

జిల్లాలో మొదటి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పోతారంలో ప్రారంభించుకు న్నామన్నారు. పచ్చివడ్ల పేరుతో పంటల వద్ద అమ్ముకునే ప్రయత్నం చేయొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వడ్ల కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొస్తే మద్దతు ధర వస్తుందని తెలిపారు. తూకంలో మోసం లేకుండా, డబ్బుల పేమెంట్ విషయంలో కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ‘గతంలో ఓ ఆసామి మా గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసుకుని పోయాడు డబ్బులు ఇవ్వలేదని నా దగ్గరికి వచ్చారు. అలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వమే మీ దగ్గర ధాన్యం కొనుగోలు చేస్తుంది ’ అని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలు ఈరోజు ప్రారంభం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించి భవిష్యత్తులో ఇంకా అనేక ప్రయోజనాలు కలిగించేలా నిర్ణయం తీసుకుంటుందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామన్నారు. అగ్రికల్చరల్ పనిముట్లు మండల సమైక్యాల ద్వారా ఇచ్చి రైతులకు ఉపయోగపడేలా చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, సమైక్య సంఘాల ద్వారా 600 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామాల్లో జరుగుతుందని.. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు వస్తామని తెలిపారు. ఫేస్ -1, ఫేస్ -2 కింద ఇల్లు మొత్తం లేనివారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా గ్రామంలో నిర్ణయం తీసుకోవాలన్నారు.

## ఆ భూములను వేలం వేయడం కుదరదు

మొదటిపేజీ తరువాయి

గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టు లో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి రూ. వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు.

# పెగడపల్లి లో ఘనంగా అడ్లూరి జన్మదిన వేడుకలు

తొలిఅడుగు, ధర్మపురి, ఏప్రిల్ 01 : ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ గారి జన్మదిన వేడుకల సందర్భంగా పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మణ్ కుమార్ గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విరజిల్లుతూ మంత్రివర్గంలో చోటు దక్కాలని ప్రజలకు అందుబాటులో ఉండుకుంటూ ధర్మపురి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న లక్ష్మణ్ కుమార్ గారి సేవలు రాష్ట్రమంతా చేసేలా భగవంతుని ఆశీస్సులు కావాలని ప్రార్థన చేశారు అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఓరగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్యావ పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి కేక్ కట్ చేసి కస్తూర్బా గాంధీ స్కూల్ లో స్వీట్లు పంపిణీచేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మండల ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చాట్ల విజయభాస్కర్ బండారి శ్రీనివాస్ సంది మల్లారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పురుషోత్తం అనిల్ గౌడ్ అధికార ప్రతినిధి పూసల తిరుపతి కడారి తిరుపతి తోట మల్లేశం మద్దెల సుధీర్ రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ఓయూ జేఏసీ చైర్మన్ కోలాపూర్ చంద్రశేఖర్ అమిరి శెట్టి లక్ష్మీనారాయణ,శ్రీరామ్ అంజయ్య పటేల్ సత్యనారాయణ రెడ్డి అజ్మీర అంజి నాయక్ ఇస్లావత్ రవి నాయక్ మందపల్లి అంజయ్య మారం కొమురయ్య కాసవిని కుమార్ మోదుంపల్లి ఎర్ర అంజయ్య లక్ష్మణ్ చెట్ల కిషన్ కొంచెం రాజేందర్ చాట్లా ప్రశాంత్ వడ్లూరి



ప్రవీణ్ కుమార్ లింగంపల్లి మహేష్ నరేందర్ పెద్ద సత్యం ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి కొత్తూరు విష్ణు నీరటి రాజేందర్ బుర్ర సంపత్ కుమార్ తడగొండ కుమార్ లక్ష్మణ్ పుల్కం జలపతి మాడిశెట్టి లక్ష్మీనారాయణ ఆత్మకూరు అశోక్ మల్యాల ఎల్లయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పొడిగింపు

- పినపాక యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి
- రాజీవ్ యువ వికాసం పథకం గడువును ఈ నెల5 నుండి 14వ తారిఖు వరకు పొడిగింపు



మణుగూరు, ఏప్రిల్ 01 తొలిఅడుగు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం లోని యువతీ యువకులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం గడువును ఈనెల 5 నుండి 14వ తారీకు వరకు పొడిగించారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఈబీసీ,ఈడబ్ల్యూఎస్ వర్గాల యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి రూ.50,000 నుండి రూ.4,00,000 వరకు ఋణం లభిస్తుంది. సబ్సిడీ శాతం ఎంచుకున్న పథకంపై ఆధారపడి ఉంటుంది. ఈ పథకం ద్వారా రూ.50,000 వరకు 100% సబ్సిడీ, రూ.50,001-1,00,000 వరకు 90% సబ్సిడీ, రూ.1,00,001-2,00,000 వరకు 80% సబ్సిడీ, రూ.2,00,001-4,00,000 వరకు బలహీన వర్గాలకు 70%, ఇతరులకు 90% సబ్సిడీ కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించకూడదు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరి. అర్హత కలిగిన యువతీ యువకులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు.

# అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాల అమలు - మంత్రి పొన్నం ప్రభాకర్

- సిరిసిల్లలో సన్నబియ్యం పంపిణీని
- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి ప్రారంభించిన మంత్రి

తొలిఅడుగు, సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 01 : రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమమని రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఉన్న రేషన్ దుకాణంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ మహేష్ బీ గితే తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని మంత్రి, విప్, కలెక్టర్, ఎస్పీ తదితరులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది రోజున ప్రారంభించారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు రాష్ట్రంలోని 17,263 రేషన్ దుకాణాల్లో రెండు లక్షల 91 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. దాదాపు 60 వేల ఉద్యోగాలను తమ ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తు చేశారు. మహిళల అందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,రూ. 500 కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. మహిళా మణులను కోటీశ్వరులుగా చేయాలని సదుద్దేశంతో ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి కింద వివిధ యూనిట్లు ప్రారంభించామని తెలిపారు. అలాగే సోలార్ యూనిట్లు మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సన్న సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాల్కు అదనంగా 500 అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీకి నూతన బస్సులు అందజేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందజేస్తున్నామని వివరించారు.

- జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా..

రాష్ట్ర ప్రభుత్వం సోషియో ఎకనామిక్ సర్వే ను ఇటీవల నిర్వహించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని నేత కార్మికులకు భరోసా కల్పిస్తూ గత బకాయిలను విడుదల చేసిందని, అలాగే యార్న్ బ్యాంకును ప్రారంభించిందని వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. దాదాపు 20వేల కోట్ల రూపాయల రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని వెల్లడించారు. త్వరలో పెన్షన్ పంపిణీ ఇతర కార్యక్రమాలను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని ప్రకటించారు. జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా లక్ష 70 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు 3275 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప, అదరపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి పౌర సరఫరాల మేనేజర్ రజిత

తదితరులు పాల్గొన్నా రు .

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- సన్న బియ్యంతో పేదల సంతోషం
- గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 01: రాష్ట్ర ప్రజలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా అందిస్తున్న ఉచిత సన్న బియ్యం పంపిణీని మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు రేషన్ దుకాణాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్దార్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని, గతంలో రూ. 5 కిలో బియ్యం ఉన్నదాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి రూ. 2 లకు బియ్యం ఇచ్చారని తదుపరి కాంగ్రెస్ హయాంలోనే తలసరి నాలుగు కిలోలు ఉన్న బియ్యాన్ని ఆరు కిలోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదీనన్నారు. ఇప్పుడు కూడా సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు రేషన్ కార్డు ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ , అజ్గార్ జంగం రమేష్ గౌడ్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, దప్పు గణేష్, సత్యం, అరుణ్ ,శ్రావణ్, ఈదుగాని శివులు, దయ్యాల యాదగిరి, కిష్ట, రెడ్డి, అంజద్ పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన చిన్నకోడూరు తహసిల్దార్

- సంక్షేమం మా లక్ష్యం
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
- ప్రతిపక్షాల కుట్రలు నమ్మద్దు
- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అజ్జు యాదవ్

తొలి అడుగు , చిన్నకోడూరు, ఏప్రిల్ 01 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చిన్నకోడూరు తహసిల్దార్ హరికిరణ్ కుమార్ రేషన్ దుకాణం నందు గ్రామ ప్రజలకు పంపిణీ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ మాట్లాడుతూ దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని,ప్రజా ప్రభుత్వ లక్ష్యం పేద ప్రజల సంక్షేమం అని ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చేందుకు నిరంతరం శ్రమిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ఉగాది సందర్భంగా హుజూర్నగర్ వేదికగా ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఆహార భద్రత కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ప్రజాప్రతితం ఉచితంగా సన్నబియ్యం అందించబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి చిక్కుడు అనిల్ కుమార్, అనంతసాగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మెట్ల అజయ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు దొంతరబోయిన సంపత్,రేషన్ డీలర్ భూంపల్లి సత్తయ్య,మాజీ ఎంపీటీసీ గంగ సరిత పర్శరాములు, మాజీ సర్పంచ్ చామకూర విజయ లింగం, వివిధ పార్టీల నాయకులు పిన్నింటి చందు,తాళ్లపల్లి రాజేష్ గౌడ్,మెట్ల వేణు,చెరుకు కొమురయ్య లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ట్రైబల్ మ్యూజియం ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాం అని మాట్లాడటం అవివేకం

**- ఆదివాసి జెఏసీ మణుగూరు మండల నాయకులు సోడే రవికుమార్ దొర, పూణెం రమేష్**

తొలిఅడుగు, మణుగూరు, ఏప్రిల్ 01 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం కేంద్రంగా ఐటిడిఏ ప్రాంగణంలో ఆదివాసుల జీవన విధానం వారి యొక్క ఆచార అలవాట్లు కట్టుబాట్లు సంస్కృతి సాంప్రదాయ విధానమును రాబోయే తరాల ఆదివాసులకు గుర్తుండేలా భద్రాచలం అంటేనే ఆదివాసి ప్రాంతం షెడ్యూల్ ఏరియా అని (26-1-1950) సంవత్సరంలో గెజిట్ ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయని (27-7-1977) కు ముందు ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి గిరిజన తెగలు స్థానికంగా ఉన్న గిరిజనేతరులు కాక మరొక గిరిజన తెగ లేదు అలాంటప్పుడు లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు రాంబాల్ నాయక్ అనుచిత వ్యాఖ్యలతో ట్రైబల్ మ్యూజియం ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాం అని అనడం సిగ్గుమాలిన చర్య అని ఆదివాసి జేఏసీ మణుగూరు మండల నాయకులు మండిపడ్డారు. సంతు సేవాలాల్ మహారాజ్ కర్ణాటకలో పుట్టి మహారాష్ట్రలో చనిపోతే ఆదివాసుల గడ్డపై విగ్రహాన్ని ట్రైబల్ మ్యూజియంలో ఎందుకు పెట్టాలని లంబాడి తెగ ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క కులంలో చలామణి అవుతూ చట్టాలను హక్కులను పొందడమేకాక ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని సూటిగా ప్రశ్నించారు. ఆదివాసుల చరిత్ర తెలియని రాంబాల్ నాయక్ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని అన్నారు





# గ్యారెంటీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్

- **ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ఆపసోపాలు**
- **సీఎం, డిప్యూటీ సీఎం పై ఛీటింగ్ కేసు నమోదు చేయాలి**
- **గ్యారెంటీలను అమలుకు పోరాటాలు చేస్తాం**
- **బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన**
- **బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, రేగా కాంతారావు**



తొలిఅడుగు, మణుగూరు, ఏప్రిల్ 01 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలొ గత అసెంబ్లీ ఎన్నికల ముందు గ్యారంటీల గారడీతో రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ వాటి అమలుపై చేతులుఎత్తేసిందని,గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను, మహిళలను మోసం చేసిందని, పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు.ఆరుగ్యారంటీ లను అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో మంగళవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంతారావు పార్టీ కార్యాలయం నుండి గులాబీ శ్రేణులతో కలిసి పోలీస్ స్టేషన్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీర్యాలీ నిర్వహించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై ఛీటింగ్ కేసు నమోదు చేయాలని ఆయన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం కాంతారావు విలేకరులతో మాట్లాడారు.పుట్టెడు అప్పులు తట్టెడు అబద్ధాలు తప్ప ఇచ్చిన హామీలను అమలు చేసే ఆలోచనలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంకు లేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆపసోపాలు పడుతుందన్నారు. సోనియమ్మ రాజ్యం రాగానే, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని పొంకనాలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసే ఆలోచన చేయడం లేదన్నారు.దళితులు, గిరిజనులు,బహుజనులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసగించేలా గత ఎన్నికలలో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళల ఉచిత బస్సు హామీ పథకం తప్ప మిగతా ఆరుగ్యారెంటీ హామీలను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులకు పదవులపై ఉన్న శ్రద్ధ పేద ప్రజల సంక్షేమంపై లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం,అబద్ధాలు అని మండిపడ్డారు.సోనియా, రాహుల్ గాంధీల సమక్షంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఏమయిందని నిలదీశారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మభ్యపెడుతోందన్నారు. కొత్త రేషన్ కార్డుల ఊసేలేదని, మహిళలకు ఆర్థిక సాయం మాటేలేదని, ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. గత సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా మార్చారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుల మీదే ఆధార పడ్డారన్నారు. ప్రభుత్వ భూములు, లిటిగేషన్, హౌసింగ్ బోర్డ్ భూములు అమ్మడం అప్పులు చేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. గారడీలతో ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ నేడు ఆరు గ్యారెంటీలను అమలు చేసే పరిస్థితుల్లో లేదన్నారు.ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. గ్యారెంటీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**- అర్హులైన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణి**



తొలి అడుగు, చిన్నకోడూరు, ఏప్రిల్ 01 : కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పేదలపై చిత్తశుద్ధి తో ప్రతి పేద వాడు పేదవాడిగానే మరణించద్దు ప్రతి పేదవాడి కనీస అవసరమైన తినే తిండి విషయంలో పేద వాడి కలగా మిగిలిపోయిన సన్నబియ్యం తినాలానే కోరిక దశబ్దల కళ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డిగారు నెరవేర్చరన్నారు ఈ సందర్బంగా చిన్నకోడూరు మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ రేషన్ షాప్ లో నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరీ కృష్ణ, చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆదేశాలమేరకు చిన్నకోడూరు మండలం నాయకులు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణి చేసారు ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సంధబోయిన పర్శరాం, %ంఎ% సెల్ జిల్లా కన్వీనర్ పొన్నలా రాజేష్,మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్ యూత్ కాంగ్రెస్ మండల మాజి అధ్యక్షులు ఉడుత జయంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉప అధ్యక్షులు ఉడుత ప్రశాంత్, సీనియర్ నాయకులు నముండ్ల వినోద్,గొట్టపర్తి చంద్, మేడిపల్లి శ్రీకాంత్, అనిల్, ఇరుమల్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది 6.5 శాతం వృద్ధి..!




తొలిఅడుగు, : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఇవై ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. 2024-25లో 6.4 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేఇసంది. ”ఎన్ఎస్ఒ గణంకాల ప్రకారం.. 2024-25లో 6.5 శాతం వృద్ధి నమోదవ్వాలంటే గడిచిన జనవరి-మార్చి త్రైమాసికంలో జిడిపి 7.6 శాతం పెరగాలి. దీన్ని సాధించాలంటే ప్రయివేటు తుది వినియోగ వ్యయం వృద్ధి 9.9 శాతంగా ఉండాలి. ఈ స్థాయిలో ఇటీవలి సంవత్సరాల్లో వృద్ధి నమోదు కాలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ మూలధన వ్యయం పెరగాల్సి ఉంది.” అని ఇవై తెలిపింది. ప్రభుత్వం విద్యపై చేస్తున్న వ్యయాలు ప్రస్తుతం జిడిపిలో 4.6 శాతంగా ఉండగా, 2048 నాటికి 6.5 శాతానికి పెంచాలని ఇవై నివేదిక సూచించింది. ఆరోగ్యంపై 2021లో జిడిపిలో 1.1 శాతానికి సమానమైన నిధులు ఖర్చు చేయగా, 2048 కల్లా దీన్ని 3.8 శాతానికి చేర్చాల్సిన అవసరం ఉందని ఇవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాత్సవ సూచించారు.

# రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న గోల్డ్.. ఈ రోజు తులం ఎంతుందంటే..?




తొలిఅడుగు,గత కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. 2014 చివరి త్రైమాసికంలో బంగారం ధరలు తగ్గడంతో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. నగరంలో 18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 6,895లుగా ఉంది. బంగారంతో పాటు వెండికి సైతం డిమాండ్ భారీగానే పెరిగింది. ప్రస్తుతం గోల్డ్ ఒక సురక్షితమైన పెట్టుబడి సాధనంగా మారిపోయింది. దీంతో పసిడి ధరలు చుక్కలనంటుతున్నాయి. రోజు రోజుకూ బంగారం ధరలు ఏమాత్రం తగ్గకుండా దూసుకెళ్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. 2014 చివరి త్రైమాసికంలో బంగారం ధరలు తగ్గడంతో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. ఈరోజు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ. 9,192 ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 8,426లుగా ఉంది. అలాగే, 18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 6,895లుగా ఉంది. బంగారంతో పాటు వెండికి సైతం డిమాండ్ భారీగానే పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి.. బంగారం ధరలు. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 84,260, 24 క్యారెట్ల ధర రూ. 91,920 గా ఉంది.విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 84,260, 24 క్యారెట్ల ధర రూ. 91,920గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ. 84,410, 24 క్యారెట్ల ధర రూ. 92,070 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ. 84,260, 24 క్యారెట్ల ధర రూ. 91.920 గా ఉంది.చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ. 83,410, 24 క్యారెట్ల రేటు రూ. 90,990 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ. 84,260, 24 క్యారెట్ల ధర రూ. 91,920 గా ఉంది.

## కొత్త ఆర్థిక సంవత్సరం నష్టాలతో స్టాక్ మార్కెట్లు ప్రారంభం



తొలిఅడుగు, : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోంది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయింట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. ఆసియా–పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

## ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్య తీసుకోవాలి



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 01 : సమయపాలన పాటించని డాక్టర్లు, ఎమర్జెన్సీలో పట్టించుకోని సిబ్బంది సిపిఐ ఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య గజ్వేల్ పట్టణంలోని సిద్దిపేట జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు 10 గంటలు అయినా రావడంలేదని, ఎమర్జెన్సీలో డాక్టర్లు, నర్సులు సరిగా పట్టించుకోవడంలేదని సిపిఐ ఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. పేద ప్రజలు వృద్ధులు ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సరియైన వైద్య సేవలు అందడం లేదని డాక్టర్లు నర్సులు హౌస్ కీపింగ్ సిబ్బందితో ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను ఆసుపత్రి నుంచి పంపించడం జరుగుతుందని అన్నారు. ఉదయం 6 గంటల నుండి 9:30 వరకు ఎమర్జెన్సీ అవసరం ఉండి హాస్పిటల్ కి వెళ్తే ఓపిక వెళ్లాలని చెబుతూ హుంకరిస్తున్నారని అన్నారు అక్కడున్న సిబ్బంది ఫోన్లో కాలయాపన చేస్తున్నారు తప్ప కనీసం బిపి, పల్స్ చూడని స్థితి ఉందని అన్నారు గతంలో ఐలయ్య అనే ఎనిమిది సంవత్సరాల బాబు ఉదయం ఏడు గంటలకు తీసుకువచ్చిన ఓపి లోకి తీసుకెళ్లాలని చెప్పడం జరిగింది, అరగంట పాటు గొడవ పెట్టుకొని సూపరింటెంట్ తో మాట్లాడితే తప్ప చూడని స్థితి, అదేవిధంగా నేడు ఆర్ శ్రీనివాస్ పేషంటును తీసుకెళ్లిన నడవలేని స్థితిలో ఉన్న ఎమర్జెన్సీ లోనికి రానివ్వకుండా హౌస్ కీపింగ్ వర్కర్ అడ్డుకొని ఓపి లోకి తీసుకెళ్లాలని బెదిరించడం జరిగింది. అక్కడికి వెళ్లాక గంట అయినా డాక్టర్ లేని పరిస్థితి ఉంది, ఇదే విధంగా ప్రతిరోజు జరుగుతున్న పరిస్థితి మధ్యాహ్నం ఎవరైనా వెళ్లిన కనీసం చూడకుండానే రేపు ఉదయం ఓపికి రావాలంటూ చెప్పడం జరుగుతుంది తప్ప కనీస పరమైన మందులు ఇవ్వడం లేదు. కొద్దిమంది నర్సులు కాలయాపన చేస్తూ సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తూ ట్రైనింగ్ విద్యార్థులతో పని చేయించడం జరుగుతుంది. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సమయపాలన పాటించని డాక్టర్లపై, రోగులను పట్టించుకోని నర్సులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిచో ఆస్పత్రి ముందు ఆందోళన చేపడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రీన్ మొబిలిటీ విజన్‌లో భాగమైన 'విజ్జీ'




తొలిఅడుగు, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్ మొబిలిటీ విజన్‌లో భాగంగా డెలివరీ పార్ట్‌నర్ సంస్థ 'విజ్జీ' పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం తగ్గించేందుకు తన వంతుగా తమ రైడర్లకు ఇంధన వాహనాలకు బదులుగా ఈవీ బైక్‌లను అందించింది. గచ్చిబౌలిలోని కపిల్ టవర్స్‌లోని 'విజ్జీ' ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ రైడర్లకు తాళాలను అందించి, జెండా ఊపి ఈవీ బైక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేష్ మాట్లాడుతూ ఈవీ వాహనాల విప్లవంలో తెలంగాణ ముందుందని, ప్రభుత్వం ఈవీ వాహనాలకు అనేక రాయితీలను ఇస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఈవీ విప్లవంలో 'విజ్జీ' భాగమైనందుకు జయేష్ అభినందించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో 'విజ్జీ'కు 15 వేల మందికి పైగా రైడర్లు ఉన్నారు. తొలి దశలో భాగంగా 200 ఈవీ బైక్‌లను రైడర్లకు 'విజ్జీ' అందించింది. విజ్జీ సీఈఓ బి.రవిచందర్ రెడ్డి, సీఎస్ఓ కంకణాల అభిషేక్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## డిసెంబరు నాటికి విదేశీ అప్పులు రూ.61.38 లక్షల కోట్లు




తొలిఅడుగు, గత డిసెంబరు చివరి నాటికి భారత విదేశీ అప్పులు వార్షిక ప్రాతిపదికన 10.7 శాతం పెరిగి 71,790 కోట్ల డాలర్లకు చేరాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ప్రస్తు త మారకం రేటు ప్రకారం ఈ విలువ సుమారు రూ.61.38 లక్షల కోట్లు. 2023 డిసెంబరు నాటికి మన విదేశీ రుణ భారం 64,870 కోట్ల డాలర్లు (రూ.55.46 లక్షల కోట్లు)గా ఉంది. త్రైమాసిక ప్రాతిపదికన పోలిస్తే, 2024 సెప్టెంబరు చివరి నాటికి 71,270 కోట్ల డాలర్లుగా (రూ.60.93 లక్షల కోట్లు) ఉన్న విదేశీ రుణ భారం.. డిసెంబరు చివరికల్లా మరో 0.7 శాతం పెరిగింది. 2024 ముగిసేసరికి జీడీపీలో విదేశీ రుణభారం నిష్పత్తి 19.1 శాతంగా నమోదైంది. గత సెప్టెంబరు చివరినాటికిది 19 శాతంగా ఉంది. మన ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, వ్యక్తులు విదేశీ రుణదాతల నుంచి సేకరించిన అప్పులన్నీ ఈ పరిధిలోకి వస్తాయి. గత ఏడాది చివరినాటికి మొత్తం విదేశీ రుణ భారంలో అత్యధికంగా డాలర్లలో తీసుకున్న అప్పు వాటాయే 54.8 శాతంగా ఉంది. రూపాయల్లో తీసుకున్న విదేశీ రుణ వాటా 30.6 శాతంగా, జపాన్ యెన్‌లలో తీసుకున్న అప్పు 6.1 శాతంగా, యూరోల్లో తీసుకున్న రుణాలు 3 శాతంగా ఉన్నాయి. 2024 సెప్టెంబరుతో పోలిస్తే డిసెంబరు చివరినాటికి మొత్తం విదేశీ రుణాల్లో కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల వాటా తగ్గగా.. ప్రభుత్వయేతర రంగాల వాటా పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో ఆర్థికేతర సంస్థలు చెల్లించాల్సిన బకాయిల వాటా 36.5 శాతంగా ఉండగా.. సెంట్రల్ బ్యాంక్ మినహా డిపాజిట్లు స్వీకరించే బ్యాంకింగ్ సంస్థలు చెల్లించాల్సిన వాటా 27.8 శాతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా 22.1 శాతంగా, ఇతర ఆర్థిక సేవల సంస్థల వాటా 8.7 శాతంగా ఉంది.

# ఈ చిన్న చిన్న అలవాట్లతో పిల్లల జ్ఞాపకశక్తి పెరుగుతుంది..!

తొలిఅడుగు, పిల్లలు చదివిన విషయాలను సులభంగా గుర్తుంచుకోవాలంటే సరైన అభ్యాస పద్ధతులు అనుసరించాలి. జ్ఞాపకశక్తిని పెంచే కొన్ని ముఖ్యమైన వ్యూహాలు ఉన్నాయి. వీటిని పాటించడం వల్ల చదువు మరింత ప్రభావవంతంగా మారుతుంది. చురుకైన అభ్యాసం, విజువల్ లెర్నింగ్, మైండ్ మ్యాప్స్, ఫ్లాష్‌కార్డ్స్ వంటివి పిల్లల మెదడు పనితీరును మెరుగుపరిచి ఎక్కువ కాలం గుర్తుంచుకునేలా చేస్తాయి. పిల్లలు చదివిన విషయాలను సులభంగా గుర్తుంచుకోవాలంటే సరైన అభ్యాస పద్ధతులు అవసరం. కొన్ని సాధారణ అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. సమర్ధవంతమైన అభ్యాసం కోసం జ్ఞాపకశక్తిని మెరుగుపర్చే వ్యూహాలను అనుసరించడం చాలా అవసరం. చురుకైన అభ్యాసం, విజువలైజేషన్, చిన్న గుర్తింపు పదాలు వంటివి చదివిన విషయాలను మెదడులో నిలుపుకోవడానికి సహాయపడతాయి. ఈ పద్ధతులు చదువును మరింత సమర్ధవంతంగా, ఆనందదాయకంగా మార్చేస్తాయి. నిత్యం ఒక నిర్దిష్ట సమయాన్ని చదువుకు కేటాయించడం వల్ల పిల్లలు క్రమశిక్షణతో చదువుకునే అలవాటు పెంచుకుంటారు. ఇది విషయాలను సులభంగా గుర్తుంచుకోవడానికి సహాయపడుతుంది. క్రమం తప్పకుండా చదివితే మేమరీ పవర్ మెరుగుపడుతుంది. క్లిష్టమైన విషయాలను చిన్న పదాలతో, ప్రాసలతో లేదా గుర్తించదగిన విధంగా రూపొందించుకోవడం వల్ల పిల్లలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. మానసిక ఉపాయాలు, గుర్తింపు పదాలు విద్యార్థులకు చదివిన విషయాలను మరింత సులభంగా గుర్తుంచుకునేలా చేస్తాయి. చర్చలు, బోధన, ఆచరణాత్మక పద్ధతులు పిల్లల చదువును మరింత ప్రభావవంతంగా మారుస్తాయి. చురుకైన అభ్యాసం ద్వారా పిల్లలు ఎక్కువ కాలం విషయాలను గుర్తుంచుకోవచ్చు. ఇతరులకు నేర్చుకున్న విషయాలను బోధించడం మరింత మేలు చేస్తుంది. ఒకేసారి ఎక్కువ విషయాలను చదవడం కన్నా, చిన్న చిన్న ముక్కలుగా విభజించి చదివితే మెదడు వాటిని సులభంగా గుర్తుంచుకోగలదు. దీనిని చంకింగ్ అనే వ్యూహంగా పిలుస్తారు. ఇది ఎక్కువ సమాచారం మెదడులో నిల్వ ఉండేలా చేస్తుంది. ఫ్లాష్‌కార్డ్స్ ద్వారా ముఖ్యమైన విషయాలను పిల్లలు సులభంగా గుర్తుంచుకోవచ్చు. ముఖ్యమైన సమాచారాన్ని చిన్న కార్డులపై రాసి తరచూ పునర్విమర్శ చేయడం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. పిల్లలు విజువల్‌గా ఆలోచించేలా ప్రోత్సహించాలి. మైండ్ మ్యాప్స్, చిత్రాలు, గమనికలు వంటివి ఉపయోగించడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదివిన విషయాలను ఒక కథలా మానసికంగా ఊహించుకోవడం అవగాహన పెంచుతుంది. తరచూ పునర్విమర్శ చేయడం ద్వారా పిల్లలు నేర్చుకున్న విషయాలను ఎక్కువ కాలం గుర్తుంచుకోవచ్చు. స్పేస్డ్ రిపిటిషన్ అనే పద్ధతి ద్వారా చదివిన అంశాలను సమయానుసారం మళ్లీ మళ్లీ



పునర్విమర్శ చేయాలి.నిద్ర, సరైన ఆహారం, వ్యాయామం మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఆరోగ్యంగా ఉండే పిల్లలు ఎక్కువ ఏకాగ్రతతో చదవగలుగుతారు. మంచి జీవనశైలి మెదడు చురుకుగా ఉండేలా చేస్తుంది. ఈ అలవాట్లు పిల్లలకు చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. సరైన పద్ధతులను పాటిస్తే పిల్లలు మరింత ప్రభావవంతంగా అభ్యసించగలరు.

# ఇంట్లోనే చిల్లీ ఎగ్స్ రెసిపీని చేయండి..!



తొలిఅడుగు, ఎగ్స్ తో చేసే వంటకాల్లో చిల్లీ ఎగ్స్ చాలా ప్రత్యేకమైనది. ఇది ఘాటుగా, క్రిస్పీగా, రెస్టారెంట్ స్టైల్‌లో రుచికరంగా ఉంటుంది. కొద్దిపాటి చిట్కాలు పాటిస్తే ఇంట్లోనే రెస్టారెంట్ రుచిని ఆస్వాదించొచ్చు. ఈ రెసిపీ పిల్లలు, పెద్దలందరికీ నచ్చేలా ఉంటుంది. ఎగ్ వంటకాలలో చిల్లీ ఎగ్స్ ఒక ప్రత్యేకమైన వంటకం. గుడ్లతో ఎన్నో రకాల రుచికరమైన వంటకాలు చేయవచ్చు, అయితే రెస్టారెంట్ స్టైల్లో తయారుచేసే చిల్లీ ఎగ్స్ అయితే మరింత ఘాటుగా, రుచిగా ఉంటుంది. ఇంట్లోనూ అదే రుచిని పొందాలంటే కొన్ని చిన్న చిట్కాలను పాటిస్తే చాలు. ఈ రుచికరమైన వంటకాన్ని ఓసారి ప్రయత్నిస్తే పిల్లలతో పాటు పెద్దలకూ కూడా ఎంతో నచ్చుతుంది.

గుడ్ల మిశ్రమం కోసం కావాల్సిన పదార్థాలు:గుడ్లు – 6/ మైదా పిండి – 1.5 టేబుల్ స్పూన్/కార్న్ ఫ్లోర్ – 1 టేబుల్ స్పూన్/నీరు – 4–5 టేబుల్ స్పూన్లు/పచ్చిమిర్చి తరుగు – 1 టీస్పూన్/కారం – టీస్పూన్/ఉప్పు – రుచికి సరిపడా/చిల్లీ ఎగ్స్ ఫ్రై కోసం కావాల్సిన పదార్థాలు:  నూనె – 4 టేబుల్ స్పూన్లు/అల్లం తరుగు – టేబుల్ స్పూన్/వెల్లుల్లి తరుగు –టేబుల్ స్పూన్/ఉల్లిపాయ తరుగు –4 టేబుల్ స్పూన్లు/పచ్చిమిర్చి చీలికలు – 2/%క్యాప్సికం ముక్కలు – కప్పు/చిల్లీ సాస్ / షెజ్వాన్ సాస్ – 1 టేబుల్ స్పూన్/రెడ్ చిల్లీ సాస్ –1 టేబుల్ స్పూన్/గ్రీన్ చిల్లీ సాస్ – 1 టేబుల్ స్పూన్/ వేడి నీళ్లు – కప్పు/డార్క్ సోయా సాస్ – 1 టీస్పూన్/వెనిగర్ – 1 టీస్పూన్/మిరియాల పొడి – 1 టీస్పూన్/అరోమాటిక్ పౌడర్ – 1 టీస్పూన్/వైట్ పెప్పర్ పౌడర్ – టీస్పూన్/చక్కెర – 1 టీస్పూన్/ ఉప్పు –రుచికి సరిపడా/

కొత్తిమీర తరుగు– అలంకరణ కోసం

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెలో గుడ్లను పగలగొట్టి వేసుకోవాలి. అందులో పచ్చిమిర్చి తరుగు, కారం, ఉప్పు వేసి బాగా బీట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని స్టీమ్ చేసుకోవాలి కాబట్టి ముందుగా ఒక కేక్ టిన్ తీసుకుని నెయ్యి లేదా నూనెతో గ్రీస్ చేయాలి. ఇందులో గుడ్ల మిశ్రమాన్ని పోసి సిద్ధం చేసుకోవాలి. స్టీమ్ చేయడం కోసం పెద్ద గిన్నెలో రెండు గ్లాసుల నీరు పోసి స్టాండ్ ఉంచాలి. ఈ స్టాండ్ పై కేక్ టిన్ పెట్టి గిన్నెకు మూత పెట్టి హై ఫ్లేమ్‌లో 15 నిమిషాలు స్టీమ్ చేయాలి. పూర్తిగా ఉడికిన తర్వాత మిశ్రమాన్ని చల్లబరచి, టిన్ నుంచి బయటకు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్ ఫ్లోర్ వేసి కొద్దికొద్దిగా నీరు పోసి మిశ్రమాన్ని బాగా కలపాలి. ఇది చాలా మందంగా లేకుండా.. మరీ పల్చగా కూడా కాకుండా ఉండాలి. ఇప్పుడు స్టవ్‌పై ఒక పాన్ పెట్టి నూనె వేడిచేయాలి. స్టీమ్ చేసిన గుడ్ల ముక్కలను పిండిలో ముంచి వేడి నూనెలో వేయాలి. ఇవి గోల్డెన్ బ్రౌన్, క్రిస్పీగా అయ్యాక బయటకు తీసి ఉంచుకోవాలి. ఇప్పుడు స్టవ్‌పై పాన్ పెట్టి నాలుగు టేబుల్ స్పూన్లు నూనె వేడిచేయాలి. అందులో అల్లం, వెల్లుల్లి తరుగు వేసి బాగా వేయించాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి. అవి కాస్త మెత్తబడిన తర్వాత చిల్లీ సాస్, షెజ్వాన్ సాస్, రెడ్ చిల్లీ సాస్, గ్రీన్ చిల్లీ సాస్, వేడి నీరు వేసి బాగా కలపాలి. సాసులు కాస్త చిక్కబడిన తర్వాత డార్క్ సోయా సాస్, వెనిగర్, మిరియాల పొడి, అరోమాటిక్ పౌడర్, వైట్ పెప్పర్, చక్కెర, ఉప్పు వేసి స్టవ్ హై ఫ్లేమ్‌లో ఉంచి కలపాలి. చివరగా క్రిస్పీగా ఫ్రై చేసిన గుడ్ల ముక్కలు ఇందులో వేసి మిక్స్ చేయాలి. ఒక్క నిమిషం వేయించాక కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇంతే సింపుల్.. రెస్టారెంట్ స్టైల్ స్పైసీ, టేస్టీ చిల్లీ ఎగ్స్ రెసిపీ రెడీ అయ్యింది. ఇలా ఇంట్లోనే రెస్టారెంట్ లెవల్ స్పైసీ అండ్ క్రిస్పీ చిల్లీ ఎగ్స్ రెసిపీని సులభంగా తయారు చేయండి. ఇంకెందుకు ఆలస్యం ఇది ఓసారి ప్రయత్నించి మీ కుటుంబ సభ్యులకు సర్ప్రైజ్ ఇవ్వండి.

# రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?





తొలిఅడుగు, దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, ఆపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# శ్రీలీలకు ఇంకో లెసన్



తొలిఅడుగు, టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్లలో ముందు వరసలో ఉన్న శ్రీలీల గుంటూరు కారం తర్వాత చాలా గ్యాప్ తీసుకుని రాబిన్ హుడ్ చేసింది. దీని ఫలితమూ నిరాశపరిచింది. హిట్టు ఫ్లాపు పక్కనపెడితే దర్శకులు తనకు ఒకే తరహా పాత్రలు ఇస్తూ డాన్సులకు పరిమితం చేస్తున్న వైనాన్ని వీలైనంత త్వరగా గుర్తించడం మంచిది. ఇదిలాగే కొనసాగితే పూజా హెగ్డే లాగా అవకాశాలు క్రమంగా తగ్గిపోతాయి. వర్తమానం సంగతి పక్కపెడితే గతంలో ఎక్స్ ట్రాడినరి మ్యాన్, ఆదికేశవ, స్కందలో తన క్యారెక్టర్ల తీరుతెన్నులు గమనిస్తే ఇంచుమించు అన్నీ ఒకేలా ఉంటాయి బాక్సాఫీస్ ఫలితాలతో సహా. అలాని తనదొకటే బాధ్యతని కాదు.ఏ హీరోయిన్ అయినా హీరో కాంబో కన్నా ముందుగా చూడాల్సింది కథలో ప్రాధాన్యత. ఒకే తరహా మూస రోల్స్ ఒకదశ దాటాక ప్రేక్షకులకు బోర్ కొట్టేస్తాయి. ధమాకాలో వర్కౌట్ అయ్యింది కానీ ప్రతిసారి జరగదు కదా. భగవంత్ కేసరి పెద్ద హిట్టే కాదనడం లేదు కానీ అందులో తను మెయిన్ హీరోయిన్ కాదు. బాలయ్యతో ఒక ముఖ్యమైన బంధాన్ని పంచుకునే ఎమోషనల్ పాత్ర. కానీ పెర్ఫార్మన్స్ పరంగా శ్రీలీలకు మంచి పేరు తీసుకొచ్చింది కూడా ఇదొక్కటే. గుంటూరు కారం పాటల పరంగా ఓకే కానీ కంటెంట్ పరంగా ఆశించిన ఫలితం అందుకోలేదు. తాజాగా రాబిన్ హుడ్ వీటి లిస్టులోకి చేరిపోయింది. రవితేజ కాంబినేషన్ ని రిపీట్ చేస్తూ శ్రీలీల నటించిన మాస్ జాతర త్వరలోనే రిలీజ్ కానుంది.టైటిల్ ని బట్టి ఇందులో తనకు మరీ వైవిధ్యం దక్కపోవచ్చని అనిపిస్తోంది. అయితే శివకార్తికేయన్ పరాశక్తి మీద హోప్స్ పెట్టుకోవచ్చు. సుధా కొంగర దర్శకత్వం, టీజర్ లో చూపించిన విజువల్స్ అంచనాలు వేరేలా మార్చుతున్నాయి. కార్తీక్ ఆర్యన్ సరసన డెబ్యూ చేస్తూ నటిస్తున్న బాలీవుడ్ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతోంది. దీని మీద అమ్మడికి చాలా ఆశలున్నాయి. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ రీ స్టార్ట్ అయితే అందులో పాల్గొనాల్సి ఉంటుంది. త్వరలోనే ప్రారంభిస్తామని నిర్మాత రవిశంకర్ ఇటీవల చెప్పిన సంగతి తెలిసిందే.

# మ్యాడ్ స్క్వేర్ మెరుపులకు 55 కోట్లు

తొలిఅడుగు, భారీ బడ్జెట్ తో రూపొందిన సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ కంటెంట్ ని నమ్ముకుని బరిలో దిగిన మ్యాడ్ స్క్వేర్ అంచనాలకు మించి పెర్ఫార్మ్ చేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి దీనికి మ్యాడ్ లాగా యునానిమస్ హిట్ టాక్ రాలేదు. బాగుందన్నారు కానీ కామెడీ డోస్ సరిపోలేదనే కామెంట్స్ వినిపించాయి. కానీ యూత్ ని థియేటర్లకు వెళ్లకుండా అవి ఆపలేకపోయాయి. పై పెచ్చు కాంపిటీషన్ లో ఉన్నవి మరీ వీక్ కావడంతో మ్యాడ్ 2కి అడ్డుకట్ట లేకుండా పోయింది. నైజామ్ తో పాటు చాలా ఏరియాల్లో రెండో రోజుకే బ్రేక్ ఈవెన్ దగ్గరగా వెళ్లిపోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో మాములు విషయం కాదు.నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించిన దాని ప్రకారం మ్యాడ్ స్క్వేర్ మూడు రోజులకు గాను 55 కోట్ల 20 లక్షలు వసూలు చేసింది. ఏ కోణంలో చూసుకున్నా ఇది చాలా పెద్ద మొత్తం. ఎందుకంటే స్టార్ క్యాస్టింగ్ లేకుండా అపోజిషన్ లో మోహన్ లాల్, నితిన్, విక్రమ్ లాంటి స్టార్లను తట్టుకుని ఇంత వసూళ్లు నమోదు చేయడం సెన్సేషనే. నిన్న ప్రధాన కేంద్రాల్లో చాలా మటుకు షోలు హౌస్ ఫుల్ అయిపోయి అదనపు స్క్రీన్లు జోడించాల్సి వచ్చింది. సోమవారం కూడా రంజాన్ సెలవు కావడంతో మరిన్ని పెద్ద నెంబర్లు మ్యాడ్ స్క్వేర్ కు తోడు కాబోతున్నాయి. నిర్మాత నాగవంశీ జోస్యం నిజమవుతోంది. రేపటి నుంచి ఎంత డ్రాప్ నమోదవుతుందనేది కీలకం కానుంది. రెండో వీకెండ్ లోనూ చెప్పుకోదగ్గ కొత్త రిలీజులు లేవు. ఏప్రిల్ 10 దాకాఇదే పరిస్థితి. దీన్ని కనక మ్యాడ్ స్క్వేర్ సరిగ్గా వాడుకుంటే వంద కోట్ల గ్రాస్ కష్టమేమి కాదు. అలా అని ఈజీ అని చెప్పలేం. రేపటి నుంచి వీకెండ్ హోల్డ్ చేసుకోవడం ముఖ్యం. షోలు పెంచుతున్నారు కాబట్టి మేజిక్ నెంబర్ సాధ్యమే. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ ఎంటర్ టైనర్ తర్వాతి భాగం మ్యాడ్ క్యూబ్ ఉండబోతోంది. ఈసారి బ్యాక్ డ్రాప్ ఎలా ఉంటుంది, ఎక్కడికి తీసుకెళ్ళబోతున్నారు లాంటి ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే ఇంకొంత కాలం వెయిట్ చేయాలి.




# రాబిన్ హుడ్ బాగానే దోచాడు..



తొలిఅడుగు, రాబిన్ హుడ్ అంటే పెద్దోళ్లను దోచుకుని పేదోళ్లకు పెట్టేవాడు. ఈ పేరుతో ఓ తెలుగు సినిమా తెరకెక్కింది. రెండుసార్లు వాయిదా పడ్డాక ఎట్టకేలకు మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఐతే ఈ 'రాబిన్ హుడ్' కూడా బాగానే దోచుకున్నాడు. కానీ అతను దోపిడీ చేసింది నిర్మాతలు, బయ్యర్ల దగ్గరే. ప్రేక్షకులను మాత్రం ఆశించినంతగా దోచుకోలేకపోయాడు. దీంతో లెక్క తప్పి నిర్మాతలు, బయ్యర్లు గట్టి దెబ్బ తినే పరిస్థితి నెలకొంది. నితిన్ మార్కెట్ స్థాయికి మించి ఈ సినిమా మీద చాలా ఎక్కువే ఖర్చు పెట్టేశారు. 70-80 కోట్ల దాకా బడ్జెట్ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.నితిన్ వరుస ఫ్లాపుల్లో ఉన్నా సరే.. 'భీష్మ' కాంబినేషన్ కావడంతో వెంకీ కుడుముల మీద భరోసాతో మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు బడ్జెట్ కొంచెం ఎక్కువే పెట్టారు. సినిమా ఆలస్యం కావడం, రిలీజ్ వాయిదా పడడం వల్ల బడ్జెట్ ఇంకా పెరిగింది. దీంతో 'రాబిన్ హుడ్' మీద బాక్సాఫీస్ భారం బాగా పెరిగిపోయింది. పైగా మార్చి చివరి వారంలో తీవ్రమైన పోటీ మధ్య సినిమా రిలీజైంది. ఓవైపు మ్యాడ్ స్క్వేర్.. ఇంకోవైపు ఎంపురాన్, వీర ధీర శూర.. ఇలా రెండు వైపులా పోటీ తప్పలేదు. 'మ్యాడ్ స్క్వేర్' క్రేజ్ 'రాబిన్ హుడ్'ను బాగానే దెబ్బ తీసింది. దానికి కూడా యావరేజ్ టాక్ వచ్చినా వసూళ్లు బాగున్నాయి. 'ఎంపురాన్', 'వీర ధీర శూర' కూడా కొంతమేర డ్యామేజ్ చేశాయి. ఇటు చూస్తే 'రాబిన్ హుడ్'కు బ్యాడ్ టాక్ వచ్చింది. దీంతో సినిమా రేసులో బాగా వెనుకబడిపోయింది.

# 'కోర్ట్' టీంకు మెగాస్టార్ అభినందనలు

తొలిఅడుగు, : నేచురల్ స్టార్ నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పించిన తాజా బ్లాక్‌బస్టర్ మూవీ 'కోర్ట్ ం స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి, శివాజీ, హర్ష్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. మార్చి 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన స్పందన, హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో యునానిమస్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా కోర్ట్ చిత్రబృందాన్ని మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. నటీనటులు, దర్శకుడిని ఇంటికి పిలిచి సత్కరించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ "కోర్ట్ అందరూ గర్వపడే సినిమా. సినిమా ఎక్కడ కూడా బోర్ కొట్టలేదు. నటీనటులందరూ అద్భుతంగా నటించారు. ప్రతి పాత్ర సహజంగా ఉంది. దీన్ని కేవలం ఒక ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్‌లా కాకుండా ఒక ఎడ్యుకేటివ్ కోర్టు డ్రామాగా భావిస్తున్నాను"అని అన్నారు. ఇక కోర్ట్ సినిమా పది రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 50 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసింది. అలాగే యూఎస్‌లో వన్ మిలియన్ క్రాస్ చేసి సత్తా చాటింది.



# ఒకే ఫ్రేమ్‌లో ద్రవిడ్, ధోని అభిమానుల హర్షం ..!




తొలిఅడుగు : గువాహటి వేదికగా జరిగిన ఐపిఎల్ 2025 సీజన్‌లో ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు కలవడం అభిమానులను ఆకర్షించింది. ఆదివారం గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడ్డాయి. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో చెన్నైపై రాజస్థాన్ 6 పరుగుల తేడాతో గెలుపునందుకుంది. రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ వ్యహరిస్తున్నారు. అయితే.. ఐపిఎల్ 2025 సీజన్‌కు కొన్ని రోజుల ముందే అతడు గాయపడ్డాడు. అతడి కాలికి గాయమైన సంగతి తెలిసిందే. అయినప్పటికి వీర్ ఛైర్, చేతి కర్రల సాయంతో మైదానంలోకి వచ్చి ఆటగాళ్లకు శిక్షణ ఇస్తున్నారు. అయితే ఆర్ఆర్, సీఎస్‌కే మ్యాచ్ ముగిసిన తరువాత ధోని.. ద్రవిడ్ వద్దకు వెళ్లి అతడిని కౌగిలించుకున్నారు. ద్రవిడ్ గాయంపై ఆరా తీశారు. ఈ క్రమంలో ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు కాసేపు ముచ్చటించుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో కామెంట్లు ఊపందుకున్నారు. ఇద్దరు దిగ్గజాలను ఒకే ఫ్రేమ్‌లో చూడడం ఎంతో సంతోషంగా ఉందని అంతా హర్షాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో ద్రవిడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ద్రవిడ్, ధోని లు కలిసి చాలా కాలం పాటు టీమిండియాలో ఆడారు. వీరిద్దరు ఒకరి కెప్టెన్సీలో మరొకరు ఆడిన విషయం విదితమే. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. రాజస్థాన్ బ్యాటర్లలో నితీశ్ రాణా (81 బీ 36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీ చేయగా, రియాన్ పరాగ్ (37 బీ 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. సంజూ శాంసన్ (20) ఫర్వాలేదనిపించగా, యశస్వి జైస్వాల్ (4), ధ్రువ్ జురెల్ (3)లు విఫలమయ్యారు. సీఎస్‌కే బౌలర్లలో ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, మహేశ్ పతిరణ లు తలా రెండు వికెట్లు పడగొట్టారు. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు చెరో వికెట్ సాధించారు. అనంతరం రుతురాజ్ గైక్వాడ్ (63 బీ 44 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ బాదగా, రవీంద్ర జడేజా (32 నాటౌట్ బీ 22 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడినప్పటికి లక్ష్య ఛేదనలో చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. సీఎస్‌కే బ్యాటర్లలో రచిన్ రవీంద్ర (0), విజయ్ శంకర్ (9), శివమ్ దూబె (18), ధోని (16) లు విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో వనిందు హసరంగ నాలుగు వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మలు చెరో వికెట్ తీశారు.

# టైటిల్ విజేత జాకుబ్ మెన్సిక్




తొలిఅడుగు చెక్ రిపబ్లిక్ చిన్నోడు జాకుబ్ మెన్సిక్ (19) తన చిన్ననాటి ఆరాధ్య ఆటగాడు నొవాక్ జకోవిచ్‌కు ఝలక్ ఇచ్చాడు. ప్రత్యర్థికి సింగిల్ సెట్ కోల్పోకుండా ఫైనల్‌కు చేరుకున్న జకోవిచ్ కెరీర్ వందో ఏటీపీ టైటిల్ ముంగిట నిలిచాడు. టైటిల్ పోరులో వరుస సెట్లలో టెన్నిస్ దిగ్గజాన్ని మట్టికరిపించిన జాకుబ్ మెన్సిక్.. తొలిసారి ఏటీపీ మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మయామీ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. 19 ఏండ్ల చెక్ రిపబ్లిక్ చిన్నోడు 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల మొనగాడిని మట్టికరిపించాడు. టైబ్రేర్లకు దారితీసిన టైటిల్ పోరులో నాల్గో సీడ్ నొవాక్ జకొవిచ్ (సెర్బియా)పై 7-6(7-4), 7-6(7-4)తో వరుస సెట్లలో జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్) గెలుపొందాడు. జాకుబ్ మెన్సిక్‌కు ఇదే తొలి ఏటీపీ టైటిల్ కావటం విశేషం. కెరీర్ రికార్డు 100వ ఏటీపీ టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగిన జకోవిచ్‌కు అంతిమ సమరంలో భంగపాటు తప్పలేదు. వర్షం కారణంగా ఐదున్నర గంటలు ఆలస్యంగా ఆరంభమైన మ్యాచ్‌లో విపరీతమైన ఉక్కపోత, అలసట జకోవిచ్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. 2023 నుంచి ఏటీపీ టైటిల్ కోసం ఎదరుచూస్తున్న జకోవిచ్.. సుదీర్ఘ విరామం తర్వాత మయామీ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నా నిరాశ తప్పలేదు. మయామీ ఓపెన్ ఫైనల్లో జాకుబ్ మెన్సిక్ అద్భుతం చేశాడు. వర్షంతో టైటిల్ పోరు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మొదలైన మ్యాచ్‌లో జకోవిచ్ తడబాటుకు లోనయ్యాడు. వేగంగా పరిస్థితులకు అలవాటు పడలేకపోయాడు. తొలి సెట్‌లో జాకుబ్ దూకుడు చూపించాడు. తొలి అవకాశంలోనే జకోవిచ్ సర్వ్ బ్రేక్ చేసి 4-1తో ముందంజ వేశాడు. మరోవైపు జకోవిచ్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఉక్కపోతతో రాకెట్‌పై పట్టు చిక్కకపోగా.. కుడి కన్ను వాపుతో పలుమార్లు ఐ డ్రాప్స్ వాడుతూ ఇబ్బంది పడ్డాడు. మ్యాచ్ సాగుతున్న కొద్ది జకోవిచ్ సర్వ్ మెరుగైంది. బ్యాక్‌హ్యాండ్‌తో జాకుబ్‌ను ఇబ్బంది పెట్టాడు. టైబ్రేకర్‌కు దారితీసిన సెట్లో జకోవిచ్ నిరాశపరిచాడు. జాకుబ్ మెన్సిక్ 7-4తో పైచేయి సాధించాడు. జకోవిచ్, జాకుబ్ పోరు గత ఏడాది షాంఘై ఓపెన్ ధ తరహాలోనే సాగింది. తొలి సెట్‌ను జాకుబ్ నెగ్గగా.. రెండో సెట్లో జకోవిచ్ పైచేయి సాధించాడు. కానీ రెండో సెట్లో జాకుబ్ ఈసారి గట్టిగా నిలబడ్డాడు. జకోవిచ్‌ను కోర్టు అంతా తిప్పిన జాకుబ్.. లాంగ్ ర్యాలీలు, బలమైన బ్యాక్‌హ్యాండ్ షాట్లతో మెరిశాడు. టైబ్రేకర్‌లో మరోసారి 7-4తో జకోవిచ్‌ను ఓడించి టైటిల్ సొంతం చేసుకున్నాడు. 19 ఏండ్ల జాకుబ్ మెన్సిక్‌కు ఇది కెరీర్ తొలి ఏటీపీ1000 టైటిల్ కాగా.. జకోవిచ్ కెరీర్ 100వ ఏటీపీ టైటిల్ వేటలో మళ్లీ నిరాశపరిచాడు. మయామీ ఓపెన్‌లో జాకుబ్ మెన్సిక్ ప్రయాణం ఆశ్చర్యకరంగా సాగింది. మోకాలు నొప్పితో మయామీలో అడుగుపెట్టిన జాకుబ్ తొలి రౌండ్‌కు ముందే వాకోవర్ ఇద్దామని అనుకున్నాడు. మార్చి 20న రాబర్టో బటిస్టాతో మ్యాచ్‌కు ముందు తప్పుకుంటున్నట్టు ప్రకటించేందుకు మ్యాచ్ అధికారుల వద్దకు వెళ్లగా అప్పుడు ఆఫీసర్స్ లంచ్ బ్రేక్‌లో ఉన్నారు. దీంతో టోర్నమెంట్ ఫిజియోథెరపిస్ట్ వద్దకు వెళ్లిన జాకుబ్ తన సమస్య చెప్పి వాకోవర్ నిర్ణయాన్ని తెలిపాడు. పెయిన్ కిల్లర్స్ వాడినా ఎటువంటి ఉపశమనం లేదు. సరిగ్గా నడవటమే ఇబ్బందిగా ఉందని చెప్పాడు. దీంతో ఫిజియోథెరపిస్ట్ జాకుబ్‌కు చికిత్స మొదలెట్టాడు. మందులు మార్చాడు. అర గంటలోనే సానుకూల ఫలితం. మోకాలు బాగానే ఉంది.. తొలి రౌండ్లో తలపడదాం అనుకుని బరిలోకి దిగాడు. టోర్నమెంట్ ఫిజియోథెరపిస్ట్ జాకుబ్‌కు చికిత్స కొనసాగిస్తూనే ఉండగా.. అతడు మరింత మెరుగయ్యాడు. తొలి మ్యాచ్‌కు ముందే నిష్క్రమిద్దానుకున్న ఆటగాడు.. ఏకంగా చాంపియన్‌గా అవతరించాడు.

## రాజ్‌గిర్‌లో హాకీ ఆసియా కప్



తొలిఅడుగు ఈ ఏడాది భారత్ వేదికగా జరుగనున్న హాకీ ఆసియా కప్ టోర్నమెంట్‌కు బిహార్‌లోని రాజ్‌గిర్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది. ఈ మేరకు బిహార్ స్టేట్ స్పోర్ట్ అథారిటీతో హాకీ ఇండియా ఎంఓయు ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల 2024 మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి విజయవంతంగా ఆతిథ్యం అందించిన రాజ్‌గిర్‌లో ఇది రెండో మేజర్ టోర్నమెంట్ కానుంది. 12వ ఆసియా కప్‌లో ఆతిథ్య భారత్ సహా పాకిస్థాన్, జపాన్, దక్షిణ కొరియా, చైనా, మలేషియాలు పోటీపడనున్నాయి. ఆసియా హాకీ ఫేడరేషన్ నిర్వహించే అర్హత టోర్నమెంట్ నుంచి మరో రెండు జట్లు అర్హత సాధించనున్నాయి. ఆసియా కప్ విజేత నేరుగా 2026 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది.

## అరుదైన రికార్డు సాధించిన సూర్యకుమార్ యాదవ్



తొలిఅడుగు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఖాతా తెరిచింది. వాంఖడే స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే ఈ విజయంలో సూర్యకుమార్ యాదవ్ కీలక పాత్ర పోషించాడు. 9 బంతుల్లో 27 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. టి-20ల్లో 8వేల పరుగుల మైలురాయిని దాటిన ఐదో భారత ఆటగాడిగా సూర్య నిలిచాడు. ఈ జాబితాలో 12,976 (384 ఇన్నింగ్స్) పరుగులతో విరాట్ కోహ్లీ మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో 11,838(437 ఇన్నింగ్స్) పరుగులతో రోహిత్ శర్మ ఉన్నాడు. మూడో స్థానంలో శిఖర్ ధవన్(331 ఇన్నింగ్స్‌లో 9797 పరుగులు), నాలుగో స్థానంలో సురేష్ రైనా(319 ఇన్నింగ్స్‌లో 8654 పరుగులు) ఉన్నారు. నిన్నటి మ్యాచ్‌తో 288 ఇన్నింగ్స్‌లో 152.28 స్ట్రైక్‌రేటుతో, 34.21 యావరేజ్‌తో 8007 పరుగులతో సూర్యకుమార్ యాదవ్ ఐదో స్థానంలో నిలిచాడు. ఇక సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 116 పరుగలకే ఆలౌట్ కాగా.. ముంబై 12.5 ఓవర్లలోనే 121 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేధించింది.

## హెూం గ్రౌండ్‌ను వేరే రాష్ట్రానికి తరలిస్తాం!

తొలిఅడుగు పాట్ కమిన్స్ నాయకత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐపీఎల్ 2025లో అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండు గెలిచింది. అయితే, ఈ జట్టు ఇప్పుడు కొత్త సమస్యలో చిక్కుకుంది. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్.. బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరచూ అనుసరిస్తున్న 'బ్లాక్‌మెయిలింగ్ వ్యూహం'ను అరికట్టాలని కోరింది. అయితే రాష్ట్ర సంఘం తమపై వచ్చిన ఈ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చింది. సన్‌రైజర్స్ ఉన్నతాధికారులకు రాసిన ఈమెయిల్‌లో ఎజూూ ఇలాంటి బెదిరింపులు కొనసాగిస్తే తమ హెూమ్ మ్యాచ్‌లను మరో రాష్ట్రానికి తరలించే ఆలోచన చేస్తామని పేర్కొంది. ా=ఎ ఒక ఉన్నత అధికారి ఈమెయిల్‌లో ఇలా రాశారు. ఎజూూ తో జరుగుతున్న పరిణామాలు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీపై వారి పదేపదే బ్లాక్‌మెయిలింగ్ వ్యూహం గురించి నేను తీవ్ర ఆందోళనతో రాస్తున్నాను. ఈ సమస్య తరచూ తలెత్తుతోంది. బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ దీనిపై తక్షణం దృష్టి పెట్టాలని నేను భావిస్తున్నాను.' అని రాసుకొచ్చారు. అధికారి మరింతగా ఇలా తెలిపారు. సంఘం నుండి ఉచిత పాస్‌ల కేటాయింపు విషయంలో ఫ్రాంచైజీకి స్పష్టత అవసరమని చెప్పారు. సాధారణంగా మొత్తం టికెట్లలో 5 శాతం ఇవ్వబడుతుంది. 'ఫ్రాంచైజీ జారీ చేసిన కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో కూడా ఎజూూ నుండి మాకు స్పష్టత కావాలి. ఎజూూ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, కోశాధికారి/కార్యదర్శితో కలిసి సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యాన్ని నిరంతరం బెదిరిస్తున్నారు. వారి డిమాండ్లు నెరవేరే వరకు హైదరాబాద్‌లో ఐపీఎల్ జరగనివ్వమని చెబుతున్నారు.' అని లేఖలో ఆయన స్పష్టం చేశారు. పాట్ కమిన్స్ నాయకత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఞూూ 2025లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడింది. అందులో రెండు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. వారు రాజస్థాన్ రాయల్స్‌పై భారీ స్కోరు (286) సాధించి గెలిచారు. కానీ లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 191 పరుగులను కాపాడలేక ఓడిపోయారు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 163 పరుగులకే ఆలౌట్ అయ్యి, 7 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూశారు.